PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 354 పేజీలు - 08 మంగళవారం 17 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నిన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



అమెరికా ఆధిపత్యంపై

ఆసియాలో నిరసనలు

● ట్రంప్ పర్యటనకు ఫిలిప్పీన్స్‌లో వ్యతిరేకత ● పశ్చిమాసియా యుద్ధం ఆపాలని, అమెరికా జోక్యం నిలిపివేయాలని డిమాండ్

తొలి అక్షరం/మనీలా,నవంబర్ 16: ఆసియా దేశాలపై ఆధిపత్యం కోసం అమెరికా అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక వ్యూహాలకు వ్యతిరేకంగా ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో నిరసనలు వెల్లువెత్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటన నేపథ్యంలో వామపక్ష సంఘాలు, విద్యార్థులు, కార్మికులు ఆందోళనలు నిర్వహించారు. పశ్చిమాసియా యుద్ధాన్ని నిలిపివేయాలని, అమెరికా జోక్యాన్ని అడ్డుకోవాలని, అమెరికా మిగతా2లో...

ఆర్టీసీ పగ్గాలు చేపట్టిన

అనిల్ కుమార్

తెలంగాణ ఆర్టీసీ నూతన వైస్ చైర్మన్, ఎండీగా బాధ్యతల స్వీకరణ

వై. నాగిరెడ్డి స్థానంలో నియామకం..

బస్‌భవన్‌లో బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపీఎస్ అధికారి


2లో



విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా

సరఫరా ఉండాలి

రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలి

రైతులు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతర విద్యుత్ అందించాలి

అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 16: రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా ఉండేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ డిమాండ్, సరఫరా మధ్య వ్యత్యాసం లేకుండా చూడాలని, రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. రానున్న రబీ సీజన్‌లో రైతులతో పాటు గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని స్పష్టం చేశారు.సోమవారం హైదరాబాద్‌లోని మిగతా2లో...

రామోజీ సేవలు చిరస్మరణీయం

రామోజీ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తాం: చంద్రబాబు

తొమ్మిది రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం:కేంద్ర హోంమంత్రి అమిత్ షా



తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 16: రామోజీ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు సమాజానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. వ్యక్తులు తమ కృషి, పట్టుదలతో సంస్థలుగా, వ్యవస్థలుగా ఎదుగుతారని, అలాంటి అరుదైన వ్యక్తుల్లో రామోజీరావు ఒకరని పేర్కొన్నారు. రామోజీరావు 90వ జయంతిని పురస్కరించుకుని సోమవారం విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ మిగతా2లో...

పోలీసు బ్యాండ్లతో దేశ సమైక్యతకు

సంగీత సవ్వడి

హైదరాబాద్‌లో 27వ అఖిల భారత పోలీసు బ్యాండ్ పోటీలు ప్రారంభం

25కు పైగా బృందాలు.. 1,500 మంది కళాకారుల ప్రతిభా ప్రదర్శన


2లో

కుటుంబంపై నిజాలు చెప్పేందుకే

ఆత్మకథ: సోనియా

'బిలాంగింగ్' పుస్తకాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ అగ్రనేత

తల్లిదండ్రుల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురైన రాహుల్



తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 16: తన కుటుంబంపై ఎన్నో ఏళ్లుగా తప్పుడు కథనాలు ప్రచారంలోకి వచ్చాయని, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఆత్మకథ రాసినట్లు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తెలిపారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో రచించిన పుస్తకాన్ని సోమవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు.తన అత్త ఇందిరాగాంధీ, భర్త రాజీవ్‌గాంధీ, పిల్లలు రాహుల్, ప్రియాంక గురించి వాస్తవాలకు దూరంగా అనేక కథనాలు ప్రచారమయ్యాయని సోనియా పేర్కొన్నారు. వాటికి తన అనుభవాల ద్వారా సమాధానం చెప్పాలనే ఉద్దేశంతో పుస్తకం రాసినట్లు వివరించారు. మొదట్లో రచనకు సంకోచించినప్పటికీ రాహుల్, ప్రియాంక ప్రోత్సాహంతో ముందుకు వచ్చినట్లు తెలిపారు.ఇటలీ నుంచి భారత్‌కు వచ్చి కొత్త కుటుంబం, సంస్కృతి, సంప్రదాయాలకు అలవాటు పడిన అనుభవాలను పుస్తకంలో వివరించినట్లు చెప్పారు. మిగతా2లో...


2లో

ఖేలో ఇండియా గేమ్స్‌కు పటిష్ఠ ఏర్పాట్లు

డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో జాతీయ క్రీడా పోటీలు

ఆరు నగరాల్లో నిర్వహణ.. సుమారు 8 వేల మంది క్రీడాకారులు, ప్రతినిధుల రాక

హరీశ్‌రావు అవినీతిపై

విచారణ జరగాలి: కవిత

ప్రజాక్షేత్రంతో పాటు న్యాయపోరాటం చేస్తాం

త్వరలో భైరవ వాహనంతో రాష్ట్రవ్యాప్త యాత్ర


2లో

ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు

అనుమతివ్వాలి

సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఇండియా కూటమి నేతలు

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలు.. అఫిడవిట్‌లో సమాధానాలు లేవని అభ్యంతరం



2లో

విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాభవన్‌లో ఇంధన శాఖ అధికారులతో రాష్ట్ర విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, సరఫరా నిర్వహణ, అందుబాటులో ఉన్న వనరులు, మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు రానున్న రబీ సీజన్‌కు విద్యుత్ సంస్థలు చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశమున్నందున అందుకు తగిన విధంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. **పెరిగిన విద్యుత్ డిమాండ్** రాష్ట్రంలో ఏటా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని భట్టి విక్రమార్క తెలిపారు. గత ఏడాది నవంబర్ 16న రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 8,522 మెగావాట్లుగా ఉండగా, ఈ ఏడాది అదే తేదీన 12,802 మెగావాట్లకు చేరిందని పేర్కొన్నారు. అదేవిధంగా అక్టోబర్ 16న 20,018 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ విద్యుత్ సంస్థలు సమర్థవంతంగా సరఫరా చేయడం అభినందనీయమన్నారు. డిమాండ్ పెరిగినప్పటికీ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ అందించడంలో అధికారులు చూపిన పనితీరును ప్రశంసించారు. **రబీ సీజన్‌పై ప్రత్యేక దృష్టి** రానున్న రబీ సీజన్‌లో దీర్ఘకాలిక పొడి వాతావరణం ఉండే అవకాశాలున్నాయని, దీంతో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగే పరిస్థితులు ఏర్పడవచ్చని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన విద్యుత్‌ను సమకూర్చుకోవాలని ఆదేశించారు.

ముఖ్యంగా వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతులకు సాగు సమయంలో నిరంతర విద్యుత్ అందించడంతో పాటు గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు కూడా సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. **జలవిద్యుత్ ఉత్పత్తిలో లోటు ఉన్నా సరఫరా** వర్షాభావ పరిస్థితుల కారణంగా జలవిద్యుత్ ఉత్పత్తిలో సుమారు 4,000 మెగావాట్ల కొరత ఏర్పడినప్పటికీ ఖరీఫ్ సీజన్‌లో రైతులతో పాటు అన్ని రంగాల వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరాలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఇందులో భాగంగా దావూద్‌ఖాన్‌గూడ, బడంగ్‌పేట ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు.విద్యుత్ డిమాండ్ పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థలను సమర్థంగా నిర్వహించాలని భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ప్రజలకు, రైతులకు విద్యుత్ పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఈ సమీక్షలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, టీజీవీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, డైరెక్టర్లు శివాజీ, చక్రపాణి, నరసింహతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు అనుమతివ్వాలి

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 16:ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు అనుమతించాలని ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు, ఎన్నికల సంఘం ఐటీ విభాగం డైరెక్టర్ జనరల్‌కు 48 ప్రశ్నలు సంధించేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో పాటు మరో పది మంది కూటమి నేతలు ఈ అభ్యర్థనలో భాగస్వాములయ్యారు.ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో తమ సందేహాలకు సరైన సమాధానాలు ఇవ్వలేదని ఇండియా కూటమి నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించాలని ఎవరు నిర్ణయించారు? అందుకు ఎప్పుడు ఆమోదం తెలిపా రు? ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చేందుకు ఉపయోగించే ఫారం-6లో మార్పులు చేయాలని ఎవరు నిర్ణయిం చారు? ఈ నిర్ణయాలకు ఎన్నికల కమిషనర్లందరి ఆమోదం ఉందా? అనే ప్రశ్నలను లేవనెత్తారు.అలాగే ఎన్నికల సంఘానికి చెందిన ఈఆర్ఓనెట్, ఈసీఐనెట్ డిజిటల్ వ్యవస్థలను కేంద్రీకరించాలనే నిర్ణయం ఎవరు తీసుకున్నారు? ప్రధాన ఎన్నికల కమిషనర్ తీసుకున్న నిర్ణయాలతో మిగిలిన ఇద్దరు కమిషనర్లు ఎన్నిసార్లు విభేదించారు? వారి అభ్యంతరాలు అధికారికంగా నమోదు చేశారా? అనే అంశాలపై వివరాలు కోరారు.గతంలో ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్లు తమ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదని ప్రతిపక్ష నేతలు పేర్కొన్నారు.48 ప్రశ్నలకు సంబంధిత అధికారులు అఫిడవిట్ల రూపంలో సమాధానాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయంగా, న్యాయపరంగా చర్చ మరింత వేడెక్కింది.ఎన్నికల సంఘం మాత్రం ఎస్ఐఆర్‌కు సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ ముగ్గురు సభ్యుల ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని ఇప్పటికే కోర్టుకు తెలిపింది.ప్రతిపక్ష కూటమి లేవనెత్తిన ప్రశ్నలపై సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

రామోజీ సేవలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి)

అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొమ్మిది రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు అవార్డులు అందజేశారు.ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. కృష్ణా జిల్లాలోని సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన రామోజీరావు తన కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. తెలుగు పాఠకులకు ప్రతిరోజూ తాజా సమాచారాన్ని అందించాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. దేశంలోని రాజకీయ, సామాజిక అంశాలపై ఆయనకు లోతైన అవగాహన ఉండేదని, సమస్యలను విశ్లేషించి పరిష్కారాలను సూచించడంలో ప్రత్యేకత చూపేవారని గుర్తుచేశారు.రామోజీరావు సూచించిన రాజకీయ విశ్లేషణలు అనేక సందర్భాల్లో నిజమయ్యాయని అమిత్ షా పేర్కొన్నారు. సినిమా రంగానికి కూడా ఆయన విశేష సేవలు అందించారని, రామోజీ ఫిలింసిటీ సినీ నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట కల్పిస్తోందని అన్నారు.ం

రామోజీరావుకు పద్మవిభూషణ్ పురస్కారం రావడం తెలుగు ప్రజలకు, పాత్రికేయ రంగానికి దక్కిన గౌరవమని తెలిపారు. వచ్చే పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.**రామోజీ జయంతి రాష్ట్ర పండుగ** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రామోజీరావు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇకపై ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు.

రామోజీ పేరుతో అవార్డులు ఏర్పాటు చేసి, జయంతి సందర్భంగా ప్రదానం చేయడం మంచి పరిణామమన్నారు.

జర్నలిజం, కళలు, సంస్కృతి, గ్రామీణాభివృద్ధివ్యవసాయం, మహిళా సాధికారత, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, యువ ప్రతిభ, విద్య, వైద్యంఆరోగ్యం వంటి రంగాల్లో విశేష సేవలు అందించిన వారిని గుర్తించి పురస్కారాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఈనాడు గ్రూప్ సీఎండీ సీహెచ్ కిరణ్, రామోజీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు అవినీతిపై విచారణ జరగాలి: కవిత

- **ప్రజాక్షేత్రంతో పాటు న్యాయపోరాటం చేస్తాం**
- **త్వరలో భైరవ వాహనంతో రాష్ట్రవ్యాప్త యాత్ర**

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 16: మాజీ మంత్రి హరీశ్‌రావు అవినీతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆయన అవినీతికి సంబంధించిన ఆధారాలను సీబీసీఐడీ, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. తప్పు చేసిన వారెవరైనా చట్టప్రకారం శిక్ష పడే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడారు.

కరువుపై సీఎం నిర్లక్ష్యం రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. ఇటీవల ప్రధాని మోదీని కలిసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని కరువు పరిస్థితులు, రైతుల సమస్యలను ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు.

పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లుపై కూడా ప్రధానితో మాట్లాడకపోవడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించి, పంటలు వేయవద్దని సూచించిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా భైరవ యాత్ర ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించడమే తమ పార్టీ లక్ష్యమని కవిత తెలిపారు. పాంచజన్య సంకల్పంలో భాగంగా త్వరలో భైరవ వాహనంతో రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపడతామని ప్రకటించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించలేదని విమర్శించారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పోలీసు బ్యాండ్లతో దేశ సమైక్యతకు సంగీత సవ్వడి



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 16: పోలీసు బ్యాండ్లు కేవలం సంగీత ప్రదర్శనలకే పరిమితం కావని, క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తికి ప్రతీకలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. రంగారెడ్డి జిల్లా సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో సోమవారం 27వ అఖిల భారత పోలీసు బ్యాండ్ పోటీలను ఆయన ప్రారంభించారు.నవంబర్ 16 నుంచి 20 వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 25కు పైగా పోలీసు, కేంద్ర సాయుధ బలగాల బ్యాండ్ బృందాలకు చెందిన సుమారు 1,500 మంది పాల్గొంటున్నారు. బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్, బ్యూగిల్ విభాగాల్లో తమ సంగీత ప్రతిభను చాటనున్నారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. పోలీసు బ్యాండ్లు బలగాల క్రమశిక్షణ, గౌరవం, ఐక్యతకు ప్రతిబింబాలని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు వివిధ రాష్ట్రాల బలగాల మధ్య స్నేహభావం, సమన్వయం, జాతీయ సమైక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. **ప్రజల కోసం ప్రత్యేక సంగీత ప్రదర్శనలు** నవంబర్ 17న శిల్పారామంలో, 18న లుంబినీ పార్కులో సాయంత్రం ప్రత్యేక బ్యాండ్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రజలు కూడా ఈ సంగీత వేడుకలను వీక్షించి ఆస్వాదించాలని నిర్వాహకులు కోరారు.

అమెరికా ఆధిపత్యంపై ఆసియాలో నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని 'పాక్స్ సిలికా' కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిరసనల్లో ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు చైనా ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటోంది. చైనా ప్రధాని లీ కియాంగ్ మనీలాలో జరిగిన ఆసియాన్ సమావేశంలో మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఏకపక్ష విధానాలు, రక్షణాత్మక వాణిజ్య ధోరణులు, అంతర్జాతీయ ఘర్షణలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో చైనా, ఆగ్నేయాసియా దేశాలు ఐక్యంగా ఉండాలని, బయటి దేశాల జోక్యాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. గతేడాది చైనా, ఆసియాన్ దేశాల మధ్య వాణిజ్యం లక్ష కోట్ల డాలర్లు దాటిందని తెలిపారు.**క్వాడ్ సమావేశంపై ఆసక్తి** ట్రంప్ పర్యటనలో భాగంగా ఆసియాన్ దేశాల నేతలతో పాటు అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియా సభ్యులుగా ఉన్న 'క్వాడ్' కూటమి సమావేశం కూడా జరగనుంది. రెండేళ్ల తర్వాత ఈ నాలుగు దేశాల నేతలు సమావేశం కానుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో ప్రధాని మోడీ పాల్గొననున్నారు. ఆసియాలో అమెరికా అనుసరిస్తున్న వ్యూహాలకు భారత్ ఎంతవరకు మద్దతు ఇస్తుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది.ఇదిలా ఉండగా, చైనా-ఆసియాన్ సంబంధాలు బలోపేతమవుతున్నప్పటికీ ఆగ్నేయాసియా దేశాలు అమెరికాతోనూ వాణిజ్య సంబంధాలను విస్తరించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. మయన్మార్‌లో సైనిక పాలకులను ఆసియాన్ సమావేశాలకు దూరంగా ఉంచే విధానాన్ని కొనసాగించాలని నేతలు నిర్ణయించారు. శాంతి ప్రణాళికపై పురోగతి సాధిస్తేనే తిరిగి అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

కుటుంబంపై నిజాలు చెప్పేందుకే ఆత్మకథ: సోనియా

(మొదటి పేజీ తరువాయి)

పెళ్లి తర్వాత అత్తారింట్లో కొత్త వాతావరణానికి అలవాటు పడటం ప్రతి మహిళకు ఎదురయ్యే అనుభవమేనని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ అంటే తొలినాళ్లలో ఎంతో గౌరవంతో పాటు భయం ఉండేదని, ఆమె నుంచి క్రమశిక్షణ, ధైర్యం నేర్చుకున్నానని గుర్తుచేసుకున్నారు. రాజీవ్‌గాంధీ హత్య గురించి రాయడం తనకు అత్యంత బాధాకరమైన అనుభవమని తెలిపారు.**తల్లిదండ్రుల ప్రేమను గుర్తుచేసుకున్న రాహుల్** ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ తన తల్లిదండ్రులు రాజీవ్, సోనియాల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. చిన్నతనంలో ప్రతి భోజన సమయంలో తండ్రి ఒడిలో తల్లి కూర్చునేవారని, వారి మధ్య ఉన్న ప్రేమను చూసి అదే సాధారణ కుటుంబ జీవితం అనుకునేవాడినని చెప్పారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల హత్యలు తమ కుటుంబానికి తీరని లోటుగా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు.రాజీవ్ మరణం తర్వాత తల్లి తీవ్ర విషాదంలో కూరుకుపోయారని, ఆ సమయంలో తాను, ప్రియాంక ఆమెకు అండగా నిలిచామని తెలిపారు. సోనియా నాలుగుసార్లు క్యాన్సర్‌ను జయించారని, జీవితంలో ఎప్పుడూ భయపడటం లేదా వెనకడుగు వేయడం చూడలేదని చెప్పారు. "అమ్మా.. నాన్న నిన్ను ఎంతో ప్రేమించారు. నిన్ను చూసి ఆయన ఎంత గర్వపడేవారో చెప్పలేను" అంటూ రాహుల్ భావోద్వేగంగా ప్రసంగించారు.**పుస్తకానికి విశేష స్పందన** నవంబర్ 10న మార్కెట్‌లోకి వచ్చిన 'బిలాంగింగ్' పుస్తకానికి పాఠకుల నుంచి మంచి స్పందన లభించింది. వారం రోజుల్లోనే రెండు లక్షలకు పైగా ప్రతులు అమ్ముడైనట్లు ప్రచురణ సంస్థ హార్పర్ కాలిన్స్ వెల్లడించింది. కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, పలువురు ప్రతిపక్ష నేతలు హాజరయ్యారు.

ఖేలో ఇండియా గేమ్స్‌కు పటిష్ఠ ఏర్పాట్లు

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 16:

తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్2026ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరిగే ఈ జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. క్రీడాకారులకు నాణ్యమైన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు క్రీడా వేదికలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ పోటీలు హైదరాబాద్‌లోని పలు స్టేడియాలతో పాటు హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో జరగనున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 8 వేల మంది క్రీడాకారులు, అధికారులు, సహాయక సిబ్బంది తెలంగాణకు రానున్నారు.**విస్తృత ప్రచారానికి ప్రణాళిక** ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రధాన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో హోర్డింగ్‌లు, బెలూన్లతో పాటు క్రీడల మస్కట్, లోగోలను ప్రదర్శించాలని సీఎస్ సూచించారు. శంషాబాద్ విమానాశ్రయం, ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. క్రీడల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా టార్చ్ ర్యాలీలు నిర్వహించాలని పేర్కొన్నారు.**వసతి, రవాణా ఏర్పాట్లు** క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని, క్రీడాకారులకు నాణ్యమైన వసతి కల్పించాలని సంజయ్ జాజు ఆదేశించారు. క్రీడాకారులు పోటీలు జరిగే వేదికలకు చేరుకునేందుకు ప్రత్యేక రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల నుంచి విద్యార్థులను స్టేడియాలకు తీసుకువచ్చేందుకు కూడా తగిన రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని, మంత్రి, మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ వంటి ప్రముఖ క్రీడాకారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీబాలాదేవి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్, ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ పగ్గాలు చేపట్టిన అనిల్ కుమార్

- **తెలంగాణ ఆర్టీసీ నూతన వైస్ చైర్మన్, ఎండీగా బాధ్యతల స్వీకరణ**
- **వై. నాగిరెడ్డి స్థానంలో నియామకం.. బస్‌భవన్‌లో బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపీఎస్ అధికారి**



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 16: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) నూతన వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో అధికారుల సమక్షంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉన్నతాధికారుల బదిలీల్లో భాగంగా నవంబర్ 12న అనిల్ కుమార్‌ను ఆర్టీసీ ఎండీగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన వై. నాగిరెడ్డిని పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది.1996 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనిల్ కుమార్ గతంలో తెలంగాణ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల ఆపరేషన్స్ డీజీపీగా పనిచేశారు. పోలీసు శాఖలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన తాజాగా రాష్ట్ర ప్రజా రవాణా సంస్థకు నాయకత్వం వహించనున్నారు.

ఏళ్ల దూరం చెదిరింది.. బాల్యం మళ్లీ చిగురించింది

● 27 ఏళ్ల నిరీక్షణ.. ఒకే వేదికపై జ్ఞాపకాల జాతర ● మళ్లీ బడి గడపపై.. గురువుల చెంత 'చిన్ననాటి' ఆనందం ● కాలం మారినా.. తరగని 'స్నేహ బంధం ● జ్ఞాపకాల పల్లకిలో.. 1998-99 బ్యాచ్ మధుర కలయిక ● గురువులకు వందనం.. స్నేహానికి అభినందనం ● ఆప్యాయతల ఆలింగనం.. కళ్లల్లో ఆనంద భాష్పాలు



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్16: చదువుల బడి మనకు కేవలం అక్షరాలను నేర్పదు..జీవితాన్ని ఇస్తుంది. ఆ బడి గుమ్మం దాటి దశాబ్దాలు గడిచినా, ఆ రోజుల్లోని గురువుల దీవెనలు, స్నేహితుల అల్లరి జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ పదిలంగానే ఉంటాయి.సరిగ్గా ఇదే భావనతో, ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత మద్దిరాల హైస్కూల్ 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరారు. ఆదివారం నాటి ఆ కలయిక ఒక అద్భుతమైన భావోద్వేగాల ప్రవాహంగా మారింది.

కళ్లల్లో ఆనంద భాష్పాలు.. గురువులకు సన్మాన నీరాజనం:

చిన్ననాటి బడి గడప తొక్కి, తమకు అక్షర భిక్ష పెట్టి, భవిష్యత్తును తీర్చిదిద్దిన గురువులను చూసేసరికి ఆ పూర్వ విద్యార్థుల కళ్లల్లో ఆనంద భాష్పాలు ఉప్పొంగాయి. తమకు విద్యను నేర్పి ప్రయోజకులను చేసిన నాటి ప్రధానోపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డితో పాటు, ఉపాధ్యాయులు నర్సింహారావు, భద్రారెడ్డి, శ్రీధర్, యోగీశ్వర్, కృష్ణారెడ్డి, ఇంతియాజ్‌లను సాదరంగా ఆహ్వానించారు. చామకూరి సుధాకర్, గందశిరి రమేష్, నలమాస రమేష్, వల్లపు మల్లయ్య, బి. సోమయ్య, సీహెచ్ శ్రీను, డి. శ్రీపాల్‌రెడ్డి, ఉప్పలయ్య, మహబూబ్ అలీ, మారెల్లి సురేష్, మమత, జాన్సీ, మాధవి, షాహేదా తదితర విద్యార్థులందరూ కలిసి తమ గురువులకు సాష్టాంగ నమస్కారాలు తెలిపారు. భుజాలపై శాలువాలు కప్పి, జ్ఞాపికలు, శీల్డులు అందజేసి గురు రుణం తీర్చుకునే చిన్న ప్రయత్నం చేశారు. ఆ క్షణంలో ఉపాధ్యాయుల ఆశీర్వాదం ఆ విద్యార్థుల జీవితానికి నిజమైన సంపదగా నిలిచింది.

మళ్లీ చిన్ననాటి రోజుల్లోకి:

గుర్తుకొస్తున్నాయ్.. ఆ రోజులు...అంటూ నాటి విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను ఒక్కొక్కరూ గుర్తుచేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. చిన్ననాటి తుంటరి పనులు, తరగతి గదిలో అల్లరి, పరీక్షల భయాలు, ఉపాధ్యాయుల చేతి దెబ్బలు.. అన్నీ కళ్లముందు కదలాడాయి.

ఎన్నో ఏండ్ల తర్వాత ఒకే వేదికపై ఎదురుపడేసరికి, ఒకరినొకరు ఆప్యాయంగా గుండెల కు హత్తుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన తామంతా మళ్లీ ఆ బాల్యపు మిత్రుల చెంతనే ఉన్నామనే భావన వారిలో కలిగింది. ఈ అరుదైన కలయికలో తమ కుటుంబ విశేషాలు, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో తాము సాధించిన విజయాలు, ఎదుర్కొన్న కష్టసుఖాల ను పంచుకుంటూ ఆనందంలో మునిగిపోయారు. కాలం మారుతున్నా, తాము చదువుకున్న బడిపై, కలిసి తిరిగిన స్నేహితులపై ఉన్న మమత ఎప్పటికీ తరగదని ఆ సమ్మేళనం నిరూపించింది.

20 రోజులైనా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించని ప్రభుత్వం

● దళారుల చేతుల్లో రైతులు.. తూకంలో మోసాలు. స్పందించని అధికారులు!



తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 16: వరి కోతలు కోసి దాదాపు 20 రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం ఒక్క వడ్ల గింజ కూడా కొనుగోలు చేయలేదని చిన్న కొండూరు గ్రామానికి చెందిన రైతు చీమకండ్ల కిష్టయ్య ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు చేసేదేమీ లేక దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దళారులు గ్రామాలకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తూ తూకంలో తేడాలు చూపిస్తూ రైతులను నష్టపరుస్తున్నారని వాపోయారు. రైతుల కష్టాలను పట్టించుకోవాల్సిన అధికారులు సైతం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ పరిస్థితి ఒక్క చిన్న కొండూరు గ్రామానికే పరిమితం కాలేదని, చౌటుప్పల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే దుస్థితి నెలకొందని తెలిపారు. రైతుల సంక్షేమం గురించి, ప్రభుత్వం సాధిస్తున్న విజయాల గురించి గొప్పలు చెప్పుకునే నాయకులు క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా గుర్తించాలని కోరారు.ఇప్పటికైనా నాయకులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, దళారుల తూకం మోసాలకు అడ్డుకట్ట వేసి రైతులకు న్యాయం చేయాలని చీమకండ్ల కిష్టయ్య డిమాండ్ చేశారు.

రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఎల్‌నినో సాకుతో సాగునీటికి గండి.. ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం

ధిల్లీ మాధవరెడ్డి బిఆర్ఎస్ పార్టీ సినియర్ నాయకులు చౌటుప్పల్ మండలం



తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 16: మొన్నటివరకు ఎల్‌నినో ప్రభావం సాకుతో సాగునీటికి గండికొట్టి రైతుల నడ్డివిరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ రైతులకు రావాల్సిన బోనస్‌ను కూడా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ధిల్లీ మాధవరెడ్డి విమర్శించారు.నెల రోజులుగా రైతులు పండించిన ధాన్యం కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లోనే నిలిచిపోయిందని, ఇప్పటివరకు ప్రభుత్వం ఒక్క వడ్ల గింజ కూడా కొనుగోలు చేయకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతుల వడ్లరాశులు దళారుల పాలవుతున్నాయని, గత్యంతరం లేని పరిస్థితుల్లో అన్నదాతలు తక్కువ ధరలకు ధాన్యం అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు అండగా ఉంటామని చెప్పిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వారి సమస్యలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, రైతులకు రావాల్సిన బోనస్‌తో పాటు గిట్టుబాటు ధరను సకాలంలో అందించాలని ధిల్లీ మాధవరెడ్డి డిమాండ్ చేశారు.

భక్తులకు నిత్య అన్నదానం అందించడమే లక్ష్యం: తోర్పునూరి నరసింహ గౌడ్

శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో ఘనంగా నిత్య అన్నదాన కార్యక్రమం ప్రారంభం



తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 16: శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో స్వాములకు నిత్యం అన్నప్రసాదం అందించాలనే సంకల్పంతో తోర్పునూరి నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మొదటి రోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.మొదటి రోజు అన్నదానానికి కీ.శే. జిల్లా మురళి గురుస్వామి సన్నిధానం స్వాములు దాతలుగా వ్యవహరించారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్‌గా మొగుదాల పావని రమేష్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఈ అన్నప్రసాద కార్యక్రమానికి వారు సహకరించారు.ఈ సందర్భంగా దాతలకు, వారి కుటుంబ సభ్యులకు అయ్యప్ప స్వామి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని నిర్వాహకులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు.అన్నదాన కార్యక్రమాన్ని చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బత్తుల విప్లవ్ గౌడ్, 12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి యాదవ్, చింతల సాయిలు, సందగల్ల సతీష్ గౌడ్, వర్కాల వెంకట్ కుమార్ పాల్గొన్నారు.అలాగే గురుస్వాములు చెరుకు అశోక్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, అల్లి కృష్ణ, వరగంటి వెంకటేష్ గౌడ్, మరగోని గణేష్ గౌడ్, వంగూరి శ్రీను, పబ్బు శ్రీకాంత్ గౌడ్, ఉష్కగుల శ్రీశైలం గౌడ్ తదితర సన్నిధానం స్వాములు పాల్గొన్నారు.దేవాలయ ప్రధాన అర్చకులు పగిడోజు సంతోష్ కుమార్ శాస్త్రి, దేవాలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ముందుండి నిర్వహిస్తున్న తోర్పునూరి నరసింహ గౌడ్‌ను పలువురు అభినందించారు.

రిసార్టులు, ఫామ్‌హౌస్‌లపై అధికారుల నిఘా ఏదీ?

● అనుమతులు, భద్రతా ప్రమాణాలపై విచారణకు స్థానికుల డిమాండ్



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 16:
చౌటుప్పల్ మండల పరిధిలో రిసార్టులు, ఫామ్‌హౌస్‌లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వీటిలో ఎన్ని నిబంధనల ప్రకారం అనుమతులు పొందాయి? ఎన్ని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారు? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. కొన్ని రిసార్టులు, ఫామ్‌హౌస్‌లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి యువత పెద్ద సంఖ్యలో వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.గతంలో చౌటుప్పల్ పరిధిలోని ఓ రిసార్ట్‌లో వ్యక్తి మృతి చెందిన ఘటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రతి రిసార్ట్, ఫామ్‌హౌస్‌కు సంబంధించిన అనుమతులు, భవన నిర్మాణ నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు.రాత్రివేళల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అనుమతులు లేని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చౌటుప్పల్‌లో 58 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు అన్నదానం



- దాతల సహకారంతో నిత్య అన్నప్రసాద వితరణ ప్రారంభం



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 16:చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో 58 రోజుల పాటు నిర్వహించనున్న నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ ప్రారంభించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.నవంబర్ 16, 2026 నుంచి జనవరి 12, 2027 వరకు ప్రతిరోజూ అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం అందించనున్నారు. కీర్తిశేషులు చెరుకు జంగయ్య గౌడ్, శేషమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు చెరుకు శివకుమార్ గౌడ్ గురుస్వామి, పావని దంపతులు అన్నదానానికి సహకరించారు. అలాగే చెవ్వగొని వెంకటేష్ గౌడ్, కవిత దంపతులు తమ కుమార్తె భవ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా అన్నప్రసాద వితరణకు సహకరించారు.ఈ సందర్భంగా దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, అయ్యప్ప స్వాముల సేవలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, భక్తులు, దాతలు మరింతగా సహకరించాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కమిషనర్ వెంకటేశ్వర్లు నాయక్, కౌన్సిలర్లు, దేవాలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు, న్యాయవాదులు, భక్తులు పాల్గొన్నారు.



ఉప్పరిగడ్డలో 16 మందికి నూతన పింఛన్లు పంపిణీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే శంకర్

పేదలకు ఆర్థిక భరోసా.. 16 కుటుంబాలకు పింఛన్ కానుక



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 16: ఫరూఖ్‌నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా 16 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్లను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ చందు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. పింఛన్ల లబ్ధిదారులకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని తెలిపారు.సర్పంచ్ చందు నాయక్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తామని అన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, సర్పంచ్ చందు నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది.

గడ్కరీ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

● అధికారులకు కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశాలు



తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి, నవంబర్ 16: కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెల 19న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డితో కలిసి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాల షెడ్యూల్‌ను ముందుగానే ఖరారు చేయాలని సూచించారు. హెలిప్యాడ్ ఏర్పాట్లు, పర్యటన మార్గాల్లో రహదారుల మరమ్మతులు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వీఐపీలు, ప్రజలకు వేర్వేరుగా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పాసులు, సీటింగ్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభా వేదిక నిర్వహణ, ప్రసంగాల క్రమం, ప్రజలకు అవసరమైన సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.సమావేశంలో అదనపు డీసీపీ రామానుజం, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జాతీయ రహదారుల శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారి అఖిలాభాయ్‌కు సర్పంచుల బృందం జన్మదిన శుభాకాంక్షలు



తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 16:వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పిట్టకల్ బోడు తండా సర్పంచ్ బాదావత్ సూర్యాభాయ్ కుమార్తె అఖిలాభాయ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెక్కొండ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు భూక్య రమేష్ రాథోడ్‌తో పాటు సర్పంచుల బృందం చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.కార్యక్రమంలో భూక్య రమేష్ రాథోడ్, బానోత్ అనిత, భద్రు నాయక్, రవీందర్, సర్పంచ్ బాదావత్ సూర్యాభాయ్, వార్డు సభ్యుడు నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్ రావును పరామర్శించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 16:వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణ రామాలయం కమిటీ డైరెక్టర్ గుంటుపల్లి ప్రభాకర్ రావు మోకాలి శస్త్రచికిత్స చేయించుకోవడంతో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, రామాలయం కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో రేపు విద్యుత్ కోత

మరమ్మతు పనులతో పలు కాలనీలకు విద్యుత్ అంతరాయం

ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ నిలిపివేత



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 16: షాద్‌నగర్ పట్టణంలోని పలు కాలనీల ప్రజలు మంగళవారం విద్యుత్ అంతరాయాన్ని ఎదుర్కోనున్నారు. పట్టణంలోని 11 కేవీ శుభం ఫీడర్ పరిధిలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు, మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జి.వినోద్ వెల్లడించారు. పరిగి రోడ్డు, న్యూసిటీ, విద్యుత్‌నగర్, పారసైడ్, మల్లికార్జున, ఆదర్శ, జీహెచ్ఆర్, భగీరథ, బీరప్ప, అక్కాపురి కాలనీలతో పాటు సత్యనారాయణ గుడి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. విద్యుత్ లైన్ల పనులు పూర్తయిన వెంటనే సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వినియోగదారులు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, పనులకు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

చెరువుముందు తండాలో కొత్త చేయూత పింఛన్ల పంపిణీ

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత



తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 16:వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చెరువుముందు తండా గ్రామంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కునుసోతు మంగమ్మ-శ్రీనివాస్ ఆధ్వర్యంలో వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు అందజేశారు.గత కొన్నేళ్లుగా పింఛన్లు అందక ఇబ్బందులు ఎదుర్కొన్న తమకు కొత్తగా పింఛన్లు మంజూరు కావడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అర్హులైన వారందరికీ చేయూత పింఛన్లు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్తీక సోమవారం సందర్భంగా శ్రీ మోక్షలింగేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా దీపారాధన

● భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు..

● కార్తీక మాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యత:

● ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్



తొలి అక్షరం/చౌటుప్పల్ నవంబర్ 16: చౌటుప్పల్ పట్టణం వలిగొండ రోడ్ లో కార్తీక మాసం సోమవారం సందర్భంగా శ్రీ మోక్షలింగేశ్వర స్వామి దేవాలయంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ మాట్లాడుతూ.. కార్తీక మాసం పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసమని తెలిపారు. ఈ మాసంలో ఏ దేవుడిని పూజించినా ఆ పూజల ఫలితం సాక్షాత్తు పరమశివుడికి చేరుతుందని అన్నారు. భక్తిశ్రద్ధలతో శివుని ఆరాధించి దీపారాధన చేస్తే భగవంతుని అనుగ్రహంతో కోరుకున్న కార్యాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో కార్తీక మాసాన్ని భక్తితో జరుపుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శివ గురు స్వామి ఆదిమూలం శంకర్, వీరమల్ల దాస్ గౌడ్, కుక్కల నరసింహ, గోగులోతు శంకర్ నాయక్, బోయిని నరసింహ యాదవ్, ఒంటెద్దు నరసింహ, దోర్నాల గజేందర్, ముప్పిడి కృష్ణ, సింగనబోయిన రమేష్, పున్న శివ, భీమనగొని బాలశివతో పాటు శివస్వాములు, మహిళా భక్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వినూత్న అన్వికలను ఆశీర్వదించిన సర్పంచ్ బండి శ్రీనివాస్



తొలి అక్షరం/నెల్లికుదురు నవంబర్ 16: నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కర్నె వెంకన్న , కూతురు ఐన, రజిత , చందన్, ల కూతురు, అయినా వినూత్న మరియు అన్విక, నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకకు, రామన్నగూడెం గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ ఆ వేడుకకు హాజరై వినూత్న, అన్విక ,లను, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామన్నగూడెం గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ ఉప సర్పంచ్ కర్నె వెంకన్న, అశోక్,సాయిలు, పాశం శ్రీను, , రమేష్, సంతోష్, మురళి, వెంకన్న, ఉప్పలయ్య, నరేష్, అనిల్,సందీప్, ఈ కార్యక్రమానికి హాజరు కావడం జరిగింది.

806 మందికి నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

● అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే దొంతి





తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 16:నెక్కొండ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన చేయూత పెన్షన్లకు సంబంధించి 806 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. నెక్కొండ పట్టణంలోని మహేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.నర్సంపేట నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,900 పెన్షన్లు మంజూరయ్యాయని, మరో 400 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బంజరపల్లిలో కొత్త చేయూత పింఛన్ల పంపిణీ

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత







తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 16:వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బంజరపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రామంలోని పలువురు వితంతువులు, దివ్యాంగులకు బంజరపల్లి సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు భూక్య రమేష్ రాథోడ్ ఆధ్వర్యంలో పింఛన్లు అందజేశారు.గత కొంతకాలంగా పింఛన్లు అందక ఇబ్బందులు ఎదుర్కొన్న దివ్యాంగులు, కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్ మాట్లాడుతూ, ప్రభుత్వ చేయూత పింఛన్లను అర్హులైన వారికి గ్రామస్థాయిలో అందించడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలు

- ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు...
- జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



తొలిఅక్షరం/నర్సింహులపేట, నవంబర్ 16: జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సింహులపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చౌదారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పలువురు పేర్కొన్నారు. ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా ఉంటూ సమాజ అభివృద్ధికి జర్నలిస్టులు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులందరికీ జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ బాక్సింగ్‌లో తెలంగాణకు మూడు కాంస్యాలు.. కోచ్ నరేష్‌కు గుర్తింపు

కొత్తపేట కోచ్ నరేష్ మార్గదర్శకత్వంలో జాతీయ స్థాయిలో తెలంగాణకు పతకాలు

జాతీయ బాక్సింగ్ పోటీల్లో తెలంగాణ సత్తా.. మూడు పతకాల వెనుక నరేష్ శ్రమ



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 16: ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర అండర్-14 బాలుర జట్టు మూడు కాంస్య పతకాలు సాధించి ప్రతిభ చాటింది. ఈ విజయాల్లో కేశంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన పీఈటీ కోచ్ నరేష్ కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా నియమితులైన ఆయన అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం క్రీడాకారుల విజయానికి దోహదపడింది.న్యూఢిల్లీలోని ఈస్ట్ వినోద్ నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అక్టోబర్ 23 నుంచి 28 వరకు నిర్వహించిన జాతీయ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించారు. మారోజు మణికంఠ చారి 28-30 కిలోల విభాగంలో, గాజు అఖిలేష్ యాదవ్ 34-36 కిలోల విభాగంలో, రషీద్ బిన్ హస్సన్ 44-46 కిలోల విభాగంలో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరించి మూడు పతకాల సాధనలో భాగస్వామ్యమైన నరేష్‌పై గ్రామస్థులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన ఆయనను పలువురు అభినందిస్తున్నారు.

కార్యకర్తకు అండగా ఏదల్ల యాదవ రెడ్డి.. గాంధీ ఆసుపత్రికి

- బానోత్ నర్సింహాను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు భరోసా



తొలి అక్షరం/నెల్లికుదురు, నవంబర్ 16: పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తకు కష్టకాలంలో అండగా నిలవడమే నాయకత్వ బాధ్యత అని చాటుతూ నెల్లికుదురు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏదల్ల యాదవ రెడ్డి మానవీయతను చాటుకున్నారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హేమ్లతండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బానోత్ నర్సింహాను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.నర్సింహా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న యాదవ రెడ్డి వెంటనే హైదరాబాద్‌కు చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు ధైర్యం చెబుతూ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.యాదవ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే ప్రతి కార్యకర్త కాంగ్రెస్ కుటుంబంలో ఒక భాగమని, వారి కష్టసుఖాల్లో పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యకర్తల సేవలను పార్టీ ఎప్పటికీ మరువదని, ఆపద సమయంలో వారికి అండగా నిలవడం తమ బాధ్యత అని భరోసా ఇచ్చారు.

జాతీయ పత్రికా దినోత్సవం.. ప్రజాస్వామ్యానికి పాత్రికేయులే పట్టుగొమ్మలు!

ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే మీడియా సేవలు అమూల్యం

పాత్రికేయులందరికీ సీనియర్ జర్నలిస్ట్ బొడ్డు అశోక్ శుభాకాంక్షలు



తొలి అక్షరం/నెల్లికుదురు, నవంబర్ 16:జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ జర్నలిస్ట్ బొడ్డు అశోక్ పాత్రికేయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో జరిగే అన్యాయాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ, వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులు ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులని కొనియాడారు. ఎండనకా, వాననకా క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే పాత్రికేయుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. నిజాయితీ, నిబద్ధత, నిష్పక్షపాతంతో జర్నలిస్టులు తమ వృత్తి విలువలను కాపాడుకోవాలని ఆకాంక్షించారు.

20 ఏళ్లుగా గుడిసెలోనే జీవనం.. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి

- ఎమ్మెల్యే రామచంద్ర నాయక్‌ను వేడుకున్న వికలాంగుడు





తొలిఅక్షరం/నర్సింహులపేట, నవంబర్ 16 :నర్సింహులపేట మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఓ వికలాంగుడు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్‌ను వేడుకున్నాడు.జయపురం గ్రామానికి చెందిన గుజ్జునూరి యాకయ్య గత 20 ఏళ్లుగా గుడిసెలోనే నివాసం ఉంటున్నానని, ఇప్పటివరకు సొంత ఇల్లు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. నిరుపేదనైన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని వినతిపత్రం అందజేస్తూ ఎమ్మెల్యే కాళ్లపై పడి ప్రాధేయపడ్డాడు.అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయకుండా ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికే కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరాడు. 20 ఏళ్లుగా గుడిసెలోనే జీవనం సాగిస్తున్న వికలాంగుడి పరిస్థితి అక్కడున్న వారిని ఆలోచింపజేసింది. ప్రభుత్వం స్పందించి తనకు ఇల్లు మంజూరు చేయాలని యాకయ్య విజ్ఞప్తి చేస్తున్నాడు.

షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో జేబు దొంగల హల్‌చల్

- ప్రయాణికుడి జేబులో నుంచి రూ.15 వేల నగదు చోరీ
- నలుగురు సభ్యుల ముఠా.. ముగ్గురిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు
- బస్టాండ్‌లో భద్రతపై ప్రయాణికుల ఆందోళన



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 16: షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తి జేబులో నుంచి రూ.15 వేల నగదును అపహరించిన ఘటన కలకలం రేపింది. చోరీకి పాల్పడిన నలుగురు వ్యక్తుల్లో ముగ్గురిని ప్రయాణికులు పట్టుకుని పోలీసులకు అప్పగించగా, మరొకరు పరారయ్యారు.వివరాల్లోకి వెళితే.. కేశంపేట మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రాములు సోమవారం షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు దిగుతున్న సమయంలో అదును చూసుకున్న నలుగురు వ్యక్తులు ఆయనను చుట్టుముట్టి జేబులో ఉన్న రూ.15 వేల నగదును చాకచక్యంగా అపహరించినట్లు సమాచారం. కొద్దిసేపటికే తన జేబులో నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన రాములు వెంటనే అప్రమత్తమై కేకలు వేశారు.దీంతో అక్కడే ఉన్న ప్రయాణికులు స్పందించి దొంగతనానికి పాల్పడినట్లు అనుమానించిన నలుగురు వ్యక్తులను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఒకరు అక్కడి నుంచి తప్పించుకుని పరారవగా, మిగిలిన ముగ్గురిని ప్రయాణికులు పట్టుకున్నారు. అనంతరం వారిని పోలీసులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది.నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. బస్సులు ఎక్కే, దిగే సమయంలో ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని జేబు దొంగలు చోరీలకు పాల్పడుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. బస్టాండ్‌లో పోలీసుల నిఘా పెంచాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడటంతోపాటు వాటి ఫుటేజీనిఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బైక్ చోరీ కేసుల్లో నిందితుడికి ఏడాది జైలు

- రూ.500 జరిమానా విధించిన షాద్‌నగర్ కోర్టు



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 16:రెండు ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో నేరం రుజువు కావడంతో నిందితుడు జక్కుల శివలింగం (35)కు షాద్‌నగర్ 1వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెలరోజుల జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చింది.ఈ ఏడాది జనవరి 3న షాద్‌నగర్‌లోని రెండు ప్రాంతాల్లో బైక్‌లు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసిన పోలీసులు మాల ఎలికట్ట గ్రామానికి చెందిన శివలింగంను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. పక్కా ఆధారాలతో కోర్టులో విచారణ జరపగా నేరం రుజువైంది.కేసుల దర్యాప్తులో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణోదయ కుమార్, ఇన్‌స్పెక్టర్ కె. సీతారాం, ఎస్ఐ జి. శివారెడ్డి సహా పోలీసు సిబ్బందిని శాఖ అభినందించింది. నేరాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపారు.

పేదల ఇంట పింఛన్ వెలుగులు.. కాంగ్రెస్ ప్రజా పాలన!

నెల్లికుదురులో కొత్త పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్ చేతుల మీదుగా పంపిణీ

అర్హులైన పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : ఎదల్ల యాదవ రెడ్డి



తొలి అక్షరం/నెల్లికుదురు, నవంబర్ 16: పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని నెల్లికుదురు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదల్ల యాదవ రెడ్డి అన్నారు. ఎన్నో రోజులుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 10 గంటలకు నెల్లికుదురులోని అమూల్య గార్డెన్స్‌లో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు భూక్య ఉమా మురళీ నాయక్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు తెలిపారు. వారి చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి సంక్షేమం అంటే కేవలం పథకాల ప్రకటన కాదని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవడమేనని అన్నారు. వృద్ధులు, భర్తను కోల్పోయిన మహిళలు, దివ్యాంగులకు పింఛన్ ఆర్థిక చేయూతతో పాటు ఆత్మగౌరవంతో జీవించేందుకు భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎదల్ల యాదవ రెడ్డి కోరారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో కుమార్

- నెల్లికుదురు ప్రజావాణికి 7 దరఖాస్తులు



తొలి అక్షరం/నెల్లికుదురు, నవంబర్ 16:
నెల్లికుదురు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 7 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో సింగారపు కుమార్ తెలిపారు. వీటిలో రెవెన్యూకు 3, గృహ నిర్మాణ శాఖకు 2, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి.ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ చందా నరేష్‌తో పాటు 28 మంది అధికారులు పాల్గొన్నారు.

శబరిమల కొండల్లో ప్రతిధ్వనించే శరణుఘోష.. భక్తుడి గుండెల్లో కొలువైన అయ్యప్ప!

మాలధారణ ఓ ఆచారం కాదు..
మనిషిని మనిషిగా మార్చే ఆత్మపరిశుద్ధి ప్రయాణం!

నల్లని వస్త్రంలో నిగూఢమైన సమానత్వం.. మెడలో మాల వెనుక క్రమశిక్షణ.. నోట పలికే స్వామియే శరణం అయ్యప్ప నినాదంలో అనంతమైన భక్తిభావం. అయ్యప్ప దీక్ష అంటే కేవలం నలభై ఒక్క రోజుల నియమం కాదు.. మనిషిలోని అహంకారాన్ని తొలగించి, ఆత్మజ్ఞానానికి చేరువ చేసే ఆధ్యాత్మిక ప్రయాణం.

కాళ్లకు ముళ్లు గుచ్చుకున్నా.. కొండదారులు అలసించినా.. శరీరం శ్రమతో నిండినా భక్తుడి అడుగు వెనక్కి పడదు. ఎందుకంటే అతడి గుండెల్లో కొలువైన అయ్యప్ప నామమే కొండంత ధైర్యాన్ని ఇస్తుంది. ఆకలిలో సహనం, కోపంలో నియంత్రణ, మాటలో మాధుర్యం, చేతల్లో సేవాభావం.. ఇవే అయ్యప్ప దీక్ష నేర్పించే నిజమైన ఆభరణాలు.

శబరిమలలోని పద్దెనిమిది పవిత్ర మెట్లు ఒక్కో భక్తుడికి ఒక్కో జీవిత పాఠాన్ని బోధిస్తాయి. ఆ మెట్లను అధిరోహించేది కేవలం పాదాలు కాదు.. అహంకారాన్ని విడిచిన ఆత్మ. పంబా నది ప్రవాహం శరీరాన్ని తాకినప్పుడు కలిగే పవిత్రత కంటే, మనసులోని మలినాలను విడిచిపెట్టినప్పుడు కలిగే ప్రశాంతత గొప్పది.

అయ్యప్పా.. నిన్ను చూడటానికి కొండలు ఎక్కుతున్నామని అనుకుంటాం.. కానీ ఆ ప్రయాణంలో మనల్ని మనం తెలుసుకుంటాం. నీ దర్శనం కోసం అడుగులు వేస్తున్నామని భావిస్తాం.. కానీ ప్రతి అడుగులోనూ మనలోని మంచితనాన్ని మేల్కొలుపుకుంటాం. నువ్వు శబరిమలలోనే కాదు.. నిస్వార్థంగా సేవ చేసే ప్రతి హృదయంలోనూ కొలువై ఉంటావు.

చివరగా ఒక్కటే సత్యం.. అయ్యప్ప మాల మెడలో ఉన్నంత కాలమే కాదు, మాల తీసిన తరువాత కూడా ఆ దీక్షలో నేర్చుకున్న మంచి గుణాలు జీవితాంతం మనతో ఉండాలి. అదే నిజమైన అయ్యప్ప భక్తి.. అదే దీక్షకు సార్థకత!

స్వామియే శరణం అయ్యప్ప!

– రచన: గోనె సిద్దు స్వామి
మండలం ఇనుగుర్తి



ప్రణయ్ మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- వార్డెన్ నిర్లక్ష్యంపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలి: ఎస్ఎఫ్ఐ



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 16: షాద్‌నగర్ పట్టణంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో ఉంటూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రణయ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ అన్నారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు రాత్రి వేళల్లో బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించారు. విద్యార్థుల రాకపోకలను పర్యవేక్షించాల్సిన హాస్టల్ సిబ్బంది, వార్డెన్ విధుల నిర్వహణపై విచారణ చేపట్టాలని కోరారు. నిర్లక్ష్యం నిర్ధారణైతే వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని అన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస భద్రతా ఏర్పాట్లు కూడా లేకపోవడం ఆందోళనకరమన్నారు. హాస్టళ్లలో కాపలాదారులను నియమించి విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం స్పందించాలని శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

ప్రణయ్ మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- బీసీ హాస్టళ్లలో విద్యార్థుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 16: షాద్‌నగర్ పట్టణంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో ఉంటూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రణయ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని జాతీయ బీసీ జనసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర అప్ప అన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు రాత్రి వేళల్లో హాస్టల్ బయటకు వెళ్లాల్సిన పరిస్థితులపై అధికారులు విచారణ చేపట్టాలన్నారు. వార్డెన్, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం నిర్ధారణైతే వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. ప్రతి బీసీ సంక్షేమ హాస్టల్‌లో కాపలాదారులను నియమించి విద్యార్థుల రాకపోకలపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు భద్రత కల్పించాలని, ప్రణయ్ కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కత్తి చంద్రశేఖర అప్ప విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగ విలువలపై యువతకు అవగాహన కల్పించాలి

- షాద్‌నగర్‌లో రంగారెడ్డి రూరల్ జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సమావేశం



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 16: షాద్‌నగర్‌లో రంగారెడ్డి రూరల్ జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు విట్యాల నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొండ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 26న దేశవ్యాప్తంగా నిర్వహించే రాజ్యాంగ దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని అధికారికంగా ఆమోదించిందని, 2015 నుంచి కేంద్ర ప్రభుత్వం ఈ రోజును రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న రంగారెడ్డి రూరల్ జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా యువతలో రాజ్యాంగ విలువలు, ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.అనంతరం నూతనంగా ఎన్నికైన రంగారెడ్డి రూరల్ జిల్లా ఎస్సీ మోర్చా కమిటీ సభ్యులకు జిల్లా అధ్యక్షుడు విట్యాల నరసింహ నియామక పత్రాలను అందజేశారు. పార్టీని ఎస్సీ వర్గాలకు మరింత చేరువ చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, సీనియర్ నాయకుడు కొంద్రు పురుషోత్తం, నూతనంగా ఎన్నికైన ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ పోటీల్లో న్యూ పవర్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

- ట్రోఫీలు, పతకాలు సాధించిన క్రీడాకారులు



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 16: హైదరాబాద్‌లోని పఠాన్‌చెరువులో నిర్వహించిన నేషనల్ ఓపెన్ కుంగ్‌ఫూ కరాటే ఆల్ స్టైల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో షాద్‌నగర్‌కు చెందిన న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ట్రోఫీలు, పతకాలు సాధించారు.మాస్టర్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. లక్ష్యం షుటోఖాన్ కరాటే అకాడమీ మాస్టర్ అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాస్టర్ హంషి, సాయి యాదవ్, శిహన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థి మృతిపై విచారణ జరపాలి

• ప్రణయ్ కుటుంబానికి ఉద్యోగం కల్పించాలి: ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాష్ నాయక్



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 16: షాద్‌నగర్ ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి ప్రణయ్ క్యాటరింగ్ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ నుంచి విద్యార్థి బయటకు వెళ్లిన విషయం సిబ్బందికి తెలియదా? విద్యార్థుల భద్రతను పర్యవేక్షించాల్సిన వార్డెన్, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, కనీస భద్రతా సిబ్బంది కూడా లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. మైనర్ విద్యార్థులను క్యాటరింగ్, ఫంక్షన్ హాళ్ల పనులకు తీసుకెళ్తున్న కాంట్రాక్టర్లపై విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ప్రణయ్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఆయన తల్లికి ఉద్యోగం కల్పించాలని కోరారు. అద్దె భవనాల్లోని హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రతి హాస్టల్‌కు వాచ్‌మెన్‌ను నియమించాలని సూచించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వార్డెన్, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులను సమీకరించి షాద్‌నగర్‌లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేష్, శ్రీహరి, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలోనే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలి

• వార్డెన్లకు పూర్తి బాధ్యతలు అప్పగించి, ఖాళీలను భర్తీ చేయాలి
• ప్రణయ్ మృతి ఘటనపై బీసీ సేన జిల్లా అధ్యక్షుడు కేశమని సదర్ శీను ఆవేదన



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 16: వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు చిన్నచిన్న అవసరాల కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని రంగారెడ్డి జిల్లా బీసీ సేన అధ్యక్షుడు కేశమని సదర్ శీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో బీసీ హాస్టల్ విద్యార్థి ప్రణయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు.హాస్టళ్లలో నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచి, విద్యార్థుల అవసరాలను వార్డెన్లు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. వసతి గృహాల్లో ఉన్న వార్డెన్ల కొరతను తక్షణమే భర్తీ చేసి, ప్రతి హాస్టల్‌లో సరిపడా సిబ్బందిని నియమించాలని సూచించారు.విద్యార్థుల భద్రత, ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యం వల్ల మరో ప్రణయ్ ప్రాణం కోల్పోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కేశమని సదర్ శీను విజ్ఞప్తి చేశారు.

మరో ప్రణయ్ బలికాకముందే ప్రభుత్వం మేల్కొనాలి

- హాస్టళ్లలో విద్యార్థుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి: ప్యాట జయశ్రీకాంత్



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 16: షాద్‌నగర్‌లోని ప్రభుత్వ బీసీ వసతి గృహ విద్యార్థి ప్రణయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదకరమని రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్యాట జయశ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. మరో ప్రణయ్ బలికాకముందే ప్రభుత్వం హాస్టళ్లలో విద్యార్థుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు అవసరమైన నిత్యావసర వస్తువులు, సదుపాయాలను హాస్టళ్లలోనే అందుబాటులో ఉంచాలని, వార్డెన్లు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. ప్రణయ్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని, పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పేద తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను హాస్టళ్లలో చదివిస్తున్నారని, వారి భద్రతకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించాలని ప్యాట జయశ్రీకాంత్ డిమాండ్ చేశారు.

బాలల సమస్యల పరిష్కారానికి 'పిల్లల ప్రజావాణి'

- వినతులు స్వీకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్



తొలి అక్షరం/రంగారెడ్డి, నవంబర్ 16: బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం 'పిల్లల ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కలెక్టర్ సి. నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి బాలలతో మాట్లాడి విద్య, వైద్యం, పోషకాహారం, రక్షణ, మౌలిక సదుపాయాలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ, సీడబ్ల్యూసీ చైర్మన్ డా. కట్టా నరేందర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై కవితా గళం.. విజయనగరంలో ఇనుగుర్తి దంపతుల ప్రతిభ


జాతీయ సాహిత్య సాంస్కృతిక మహోత్సవంలో పాల్గొన్న శీలం రాజిరెడ్డి, కృష్ణకుమారి

250 మంది కవుల సమక్షంలో వస్త్రధారణ, తల్లిదండ్రుల బాధ్యతలపై కవితా పఠనం



తొలి అక్షరం/ఇనుగుర్తి నవంబర్ 16: సమాజంలో మారుతున్న జీవనశైలి, యువతలో పెరుగుతున్న పోకడలు, తల్లిదండ్రులు విస్మరిస్తున్న బాధ్యతలను ప్రశ్నిస్తూ ఇనుగుర్తికి చెందిన సాహితీవేత్తల దంపతులు శీలం రాజిరెడ్డి, కృష్ణకుమారి తమ కవిత్వంతో ఆకట్టుకున్నారు. శ్రీ శ్రీ కళావేదిక, తెలుగు భాషా పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో విద్యల నగరం విజయనగరంలోని గురజాడ వెంకట అప్పారావు ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జాతీయ సాహిత్య సాంస్కృతిక మహోత్సవంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 250 మంది కవులు హాజరై తమ కవితలను వినిపించారు. మహబూబాబాద్ జిల్లా, ఇనుగుర్తి గ్రామానికి చెందిన శీలం రాజిరెడ్డి, కృష్ణకుమారి దంపతులు అమ్మాయిల వస్త్రధారణలో వస్తున్న మార్పులు, వాటిపై తల్లిదండ్రుల నిర్లక్ష్య వైఖరిని ప్రస్తావిస్తూ చక్కని కవితను వినిపించారు. 'మొగాళ్లతో పోటీ అంటూ మోజుగా ఎగబడుతున్నారు.. నిండు బట్టల విషయంలో తొందరగా మాట్లాడుతున్నారు.. స్వేచ్ఛా స్వతంత్ర్యమంటూ స్వచ్ఛత లేక వాగుతున్నారు..' అంటూ సమాజంలో మారుతున్న ధోరణులపై ప్రశ్నలు సంధించారు. పూర్వీకుల ఆచార వ్యవహారాలను గుర్తుచేస్తూ, వస్త్రధారణలో సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవం ప్రాధాన్యాన్ని తమ కవితలో చాటిచెప్పారు. అలాగే సమాజంలో కొత్తగా విస్తరిస్తున్న ఓయో రూముల సంస్కృతిపై ఘాటుగా స్పందిస్తూ, యువత ఆలోచనా విధానంపై ఆత్మపరిశీలన అవసరమని కవితా పంక్తుల ద్వారా సందేశమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణం, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, విజయనగరం జిల్లా శ్రీ శ్రీ కళావేదిక కార్యవర్గ సభ్యులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.తెలుగు భాషా సాహిత్యాల పరిరక్షణ, కవుల్లోని సృజనాత్మక ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ మహోత్సవంలో ఇనుగుర్తి దంపతులు సామాజిక అంశాలను కవిత్వ రూపంలో వినిపించడం విశేషంగా నిలిచింది.

అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలకు విచ్చేసిన సీతక్కకు ఘన సత్కారం



తొలి అక్షరం/వరంగల్ ప్రతినిధి: మంత్రి సీతక్క ను శాలువాతో సత్కరించి,పూల బోకెను అందజేసిన వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి,ప్యాక్స్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి.ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమక్షంలో వర్ధన్నపేట నియోజకవర్గం లోని చింత నెక్కొండకు పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు కళ్యాణ లక్ష్మి చెక్కులు ఇందిరమ్మ చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ను శాలువాతో ఘనంగా సత్కరించి పూల బోకెను అందజేసిన వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి వర్ధన్నపేట ప్యాక్స్ చైర్మన్ అబ్బిడి రాజి రెడ్డి ఈ సందర్భంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే ప్రజా సంక్షేమం ప్రజల అభివృద్ధి సాధ్యమని వారన్నారు కొత్త చేయూత పింఛన్లను పంపిణీ కార్యక్రమం కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ రోడ్ల నిర్మాణం ఇవన్నీ ప్రజల కోసమే కాంగ్రెస్ పార్టీ కాంటాక్ట్ ల కోసం కాదు అని గత ప్రభుత్వం ప్రజలను మరిచి కాంటాక్ట్ కమిషన్లు వచ్చే పనులు మాత్రమే చేశారు అని అన్నారు.

సుజిత్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

- 120 మందికి వైద్య పరీక్షలు.. మందులు, కళ్లద్దాల పంపిణీ



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: హనుమకొండ పశ్చిమ నియోజకవర్గంలోని 31వ డివిజన్ సుజిత్ నగర్‌లో స్మార్ట్ ఐస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యుడు మామిండ్ల సురేష్, ఓరుగంటి సమ్మయ్య, ప్రభాకర్, సుధాకర్, సాంబయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యారంగ సంస్కరణలపై సీఎం విద్యార్థి సంఘాలతో చర్చించాలి

విద్యారంగంలో సంస్కరణలపై ఏకపక్ష నిర్ణయాలు సరికాదు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా సమితి సమావేశం బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించుకున్నారు.జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా...ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై విద్యారంగంలో తీసుకువస్తున్న సంస్కరణలపై విద్యాశాఖ మంత్రి,సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థి సంఘాలు,విద్యావేత్తలు, మేధావులు,ఉపాధ్యాయ,అధ్యాపక సంఘాలతో సమావేశం నిర్వహించి అభిప్రాయ సేకరణ నిర్వహించాలని,రాష్ట్రంలో విద్యారంగం పై ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోను ఎన్నికల మ్యానిఫెస్టోలో మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పి నేడు ఇంటర్ బోర్డును రద్దు చేసి పాఠశాల విద్యలో విలీనం చేస్తున్నట్లు హఠాత్తుగా ఎలాంటి అభిప్రాయాలు చర్చ లేకుండా ప్రకటించడం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారని,ఇప్పటికే పాఠశాల విద్య గందరగోళంగా ఉందని సరిపడ తరగతి గదులు,మౌలిక సదుపాయాలు లేవని ఇప్పుడు పాఠశాల విద్యలో ఇంటర్ ను విలీనం చేయడం వల్ల సమస్యలు పెరిగే అవకాశం ఉందని,ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడం ద్వారా ఉన్న ప్రభుత్వ కళాశాల భవనాలల్లో ఏ విద్య ఉంటుంది? ప్రభుత్వ పాఠశాలల్లో ఏ విధంగా ఇంటర్ తరగతుల నిర్వహణ చేస్తారు? ఒకే చోట 1నుండి 12వ తరగతి వరకు తరగతుల నిర్వహణ కాబట్టి బోధన సిబ్బంది అర్హతలు ఎలా ఉండాలి ఈ విధానం హడావుడిగా తీసుకోవడం ద్వారా ప్రైవేట్ కార్పొరేట్ వారికి మేలు జరుగుతుందని తప్ప ప్రభుత్వ విద్యకు నష్టం జరిగే అవకాశం ఉందని,ఓ వైపు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్,పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు ఏ విధంగా ఉంటుంది వీటి ఏర్పాటు ద్వారా ఇప్పుడు ఉన్న ప్రభుత్వ పాఠశాలలు,హాస్టళ్లకు నిర్వహణ ఏంటి అనే సందేహాలు విద్యార్థుల్లో వారి తల్లితండ్రుల్లో నెలకొందని వాటిపై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని,తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్ట్ లో ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడి,బడ్జెట్ లో విద్యకు అధిక నిధులు,ప్రభుత్వ విద్య బలోపేతం పై అనేక మంచి విధానాలను విద్యా కమిషన్ రిపోర్ట్ ఇచ్చిన ప్రభుత్వం రిపోర్ట్ ను పెండింగ్ లో పెట్టి నిరక్ష్యం చేస్తుందని,రాష్ట్రంలో ప్రభుత్వ విద్య బలోపేతం,ప్రైవేట్ విద్యను అరికట్టడానికి సీఎం చర్యలు తీసుకోవాలని,మూడేళ్లుగా విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఒక్కరోజు కూడా విద్యార్థి సంఘాలకు అపాయింట్మెంట్ ఇవ్వకుండా చర్చించకుండా నిర్లక్ష్యం చేశారని,తక్షణమే సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగ సమస్యల పరిష్కారం కృషి చేస్తూ,విద్యారంగంలో తీసుకువచ్చే సంస్కరణలపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విద్యార్థి సంఘాలు,మేధావులు,విద్యావేత్తలతో,ఉపాధ్యాయ,అధ్యాపక సంఘాలతో చర్చించాలని పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి భాషబోయిన సంతోష్,జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్,శ్రీపతి వినయ్,వేల్పుల చరణ్,కొండ చరణ్ జిల్లా సహాయ కార్యదర్శిలు సాయి గౌడ్,వంశీ,నాగరాజ్,శ్రీహర్ష,జిల్లా సమితి సభ్యులు రామ్ చరణ్,రణధీర్,సునీల్,హర్ష,లతోపాటు వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

- ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి, ప్రజలకు అందుబాటులో ఉండేందుకు కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయాలని సూచించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల జిల్లా అధ్యక్షుడిగా

రావూరి ప్రశాంత్ ఏకగ్రీవ ఎన్నిక

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి: రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఆర్.వి. లక్ష్మి

37 మంది జర్నలిస్టుల సమక్షంలో నూతన జిల్లా కమిటీ ఎన్నిక.. ప్రధాన కార్యదర్శిగా దూదికట్ల రవీంద్ర చారి, కోశాధికారిగా దేవరకొండ చంద్రబాను



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 16: విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జర్నలిస్టులు ఐక్యతతో ముందుకు సాగుతూ వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి, జర్నలిస్టుల హక్కుల సాధనకు కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఆర్.వి. లక్ష్మి పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన గౌరవం, ఐక్యతే లక్ష్యంగా సంఘటితంగా పనిచేయాలని సూచించారు.సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 37 మంది జర్నలిస్టులు హాజరుకాగా, రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఆర్.వి. లక్ష్మి సమక్షంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఆమె మాట్లాడుతూ.. జర్నలిజం అనేది కేవలం వార్తలు రాయడానికే పరిమితమైన వృత్తి కాదని, సమాజానికి దిశానిర్దేశం చేసే బాధ్యతాయుతమైన వృత్తి అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అన్యాయాలను ప్రశ్నించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జర్నలిస్టుల బాధ్యత అన్నారు. విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘం వేదికగా కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ సంఘం బలోపేతానికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.**నూతన జిల్లా కమిటీ ఎన్నిక:** జిల్లా అధ్యక్షుడిగా రావూరి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా దూదికట్ల రవీంద్ర చారి, కోశాధికారిగా దేవరకొండ చంద్రబానును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా దూదికట్ల రామాచారి, సిరికొండ విక్రమ్, సహాయ కార్యదర్శులుగా పోతుగంటి సతీష్, వెలగలేటి కిరణ్ కుమార్, మడుపు వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా గుండోజు శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా గుండోజు దేవేంద్ర చారి, వీరంటే ముఖేష్, ఎటురోజు రాజ్ కుమార్‌లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు పమ్మి సనాతన చారి, బండోజు ఉపేంద్ర చారి, మోత్కూరి వెంకటేశ్వర్లు, చిట్టిమల్ల రఘు తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు.

కేసముద్రం సీనియర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా

ఎసల్ల సత్యనారాయణ ఏకగ్రీవ ఎన్నిక

● ప్రధాన కార్యదర్శిగా గాజుల రవి.. నూతన కార్యవర్గం ఎన్నిక ● జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకు కృషి చేస్తా : నూతన అధ్యక్షుడు ఎసల్ల సత్యనారాయణ





తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 16: జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేసముద్రం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సీనియర్ జర్నలిస్టుల సమావేశంలో కేసముద్రం సీనియర్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎసల్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కూన శ్రీను, ప్రధాన కార్యదర్శిగా గాజుల రవి, కోశాధికారిగా పందుల రవిచంద్ర, సహాయ కార్యదర్శిగా శీలం దామోదర్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎసల్ల సత్యనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు సాధించేందుకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో సీనియర్ ప్రెస్ క్లబ్ ముందుంటుందని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన సీనియర్ పాత్రికేయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు సీనియర్ పాత్రికేయులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలు ప్రారంభం





తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్16: దేశంలోని వివిధ రాష్ట్రాల పోలీసులు, కేంద్ర సాయుధ బలగాల (సీఏపీఎఫ్) మధ్య సమన్వయం, క్రమశిక్షణ, సంగీత ప్రతిభను చాటిచెప్పే 27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలు సోమవారం రంగారెడ్డి జిల్లాలోని సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తోంది.ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసులు, సీఏపీఎఫ్‌లకు చెందిన 25కు పైగా బ్యాండ్ బృందాలు, సుమారు 1,500 మంది కళాకారులు పాల్గొంటున్నారు. బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్, బ్యాగుల్ విభాగాల్లో వీరు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ బ్యాండ్లు కేవలం సంగీత బృందాలు మాత్రమే కాదని, అవి దళాల క్రమశిక్షణకు, ఆత్మగౌరవానికి, సమష్టి స్ఫూర్తికి ప్రతీకలని కొనియాడారు. భాష, ప్రాంతీయ భేదాలను దాటి ప్రజలను పోలీసులకు చేరువ చేయడంలో సంగీతం ఒక వారధిలా పనిచేస్తుందన్నారు.1999లో తొలి అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలకు ఆతిథ్యమిచ్చిన సీఆర్పీఎఫ్, ఇప్పుడు 27వ ఎడిషన్‌ను నిర్వహిస్తోంది. 2023 నుంచి మహిళా బ్యాండ్ బృందాల భాగస్వామ్యం పెరగడం విశేషం. వివిధ రాష్ట్రాల పోలీసులు, కేంద్ర బలగాల కళాకారులంతా కలిసి నిర్వహించే 'కంబైన్డ్ పరేడ్' ఈ పోటీల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.**నగరవాసుల కోసం ప్రత్యేక ప్రదర్శనలు** పబ్లిక్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో రెండు చోట్ల ప్రత్యేక బ్యాండ్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మంగళవారం (నవంబర్ 17) సాయంత్రం 5.30 గంటలకు హైటెక్ సిటీలోని శిల్పారామంలో సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ సమక్షంలో, బుధవారం (నవంబర్ 18) సాయంత్రం 5.30 గంటలకు లుంబినీ పార్క్‌లో సంగీత దర్శకుడు తమన్ సమక్షంలో బ్యాండ్ బృందాలు ప్రదర్శనలు ఇవ్వనున్నాయి.సీఆర్పీఎఫ్ ఐజీలు టి.విక్రమ్, గోపాల్ కృష్ణ, విపుల్ కుమార్, డీఐజీ ఐ.వీర్రాజు, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి, మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్, ఏసీపీ చక్రపాణితో పాటు హోంశాఖ, భారత సైన్యం, రైల్వే, ఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఎన్ఐఏ, ఎన్పీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్తీక మాసం తొలి సోమవారం.. అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభ

- శివుడికి విశేష అభిషేకాలు.. భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు
- దీపారాధనతో వెలుగులీనిన ఆలయం.. భక్తులతో కిక్కిరిసిన ప్రాంగణం






తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 16: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా నిజాంపేట్‌లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పరమశివుడికి విశేష అభిషేకాలు నిర్వహించి, వేదమంత్రాలు, శివనామస్మరణల మధ్య భక్తులు పూజల్లో పాల్గొన్నారు.అనంతరం కార్తీక మాస ప్రత్యేక పూజలు, దీపారాధన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని, పరమశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల సందడి, దీపాల వెలుగులు, శివనామస్మరణతో భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. దీపాల కాంతులతో ఆలయం కనువిందు చేయగా, తొలి సోమవారం పూజలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి. కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా ఆలయంలో నెలకొన్న భక్తిమయ వాతావరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నాచారంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

- మందుబాబులు, నిబంధనల ఉల్లంఘనదారులపై కొరడా
- ప్రధాన రహదారులపై విస్తృతంగా వాహనాల తనిఖీలు
- హెల్మెట్ లేని వారు,పెండింగ్ చలాన్లు ఉన్నవారిపై కఠిన చర్యలు
- రంగంలోకి దిగిన నాచారం ఎస్సైలు ఫ్రాన్సిస్, రామ్మోహన్



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్16: రహదారి భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నాచారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.రాత్రి సమయంలో ప్రధాన కూడళ్లు, రద్దీ రహదారులపై నాచారం పోలీస్ స్టేషన్ ఎస్సైలు ఫ్రాన్సిస్, రామ్మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృతంగా వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:** ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించారా లేదా అని పోలీసులు పరిశీలించారు.సరైన పత్రాలు లేని వాహనాలను, నంబర్ ప్లేట్లు సరిగా లేని బైక్‌లను అదుపులోకి తీసుకున్నారు.అదేవిధంగా ట్యాబ్‌ల ద్వారా వాహనాలపై ఉన్న పాత పెండింగ్ చలాన్లను తనిఖీ చేసి, అక్కడికక్కడే జరిమానాలు విధించారు.మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించేందుకు బ్రీత్ అనలైజర్లతో పరీక్షలు నిర్వహించారు.**ప్రజల భద్రత కోసమే తనిఖీలు: ఎస్సైలు** ఈ సందర్భంగా ఎస్సైలు ఫ్రాన్సిస్, రామ్మోహన్ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టినట్లవుతుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. రానున్న రోజుల్లోనూ ఈ ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

నాచారం సీఐ ధనుంజయకు ఆత్మీయ వీడ్కోలు



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి పి సైదులు),నవంబర్16: నాచారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా విధులు నిర్వహించి, బదిలీపై హైదరాబాద్ యూనిట్‌కు వెళ్లిన ధనుంజయకు స్టేషన్ సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బంది ఆయనను పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతూ.. విధి నిర్వహణలో సీఐ ధనుంజయ చూపిన అంకితభావం, నాయకత్వ లక్షణాలు, సిబ్బందితో కలిసిమెలిసి పనిచేసిన తీరు అభినందనీయమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పాత్రికేయ రంగంలో ప్రతిభకు పట్టం..బెస్ట్ ఎడిటర్‌గా పస్తం సైదులు



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి,నవంబర్16: సాంస్కృతిక రాజధాని హైదరాబాద్ వేదికగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రతిభావంతులను సత్కరించేందుకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు, తొలి అక్షరం దినపత్రిక ఎడిటర్ పస్తం సైదులు ప్రతిష్టాత్మక బెస్ట్ ఎడిటర్ 2026 అవార్డును అందుకున్నారు.ప్రసన్న అరుహి ఆర్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ, లియోనార్డ్ కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఎస్ఎంఈ గ్రాండ్ కన్వెన్షన్ ఆడిటోరియంలో ఈ పురస్కార ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.వివిధ సామాజిక, సాంస్కృతిక, మీడియా రంగాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో నిర్వాహకులు పస్తం సైదులును ఘనంగా సత్కరించి, జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అతిథులు మాట్లాడుతూ.... మీడియా రంగంలో ఎడిటింగ్ అనేది అత్యంత కీలకమైన బాధ్యతాయుతమైన విభాగమని పేర్కొన్నారు.వార్తలకు సరైన రూపాన్ని ఇచ్చి, పాఠకులకు ఆసక్తికరంగా, వాస్తవికంగా అందించడంలో ఎడిటర్ పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు.పస్తం సైదులు తన దీర్ఘకాలిక పాత్రికేయ అనుభవంతో,అత్యుత్తమ నైపుణ్యంతో తొలి అక్షరం దినపత్రికకు వన్నె తెస్తున్నారని ప్రశంసించారు. ఈ అవార్డు ఆయన వృత్తిపట్ల ఉన్న అంకిత భావానికి, నిబద్ధతకు దక్కిన సరైన గుర్తింపు అని వక్తలు అభిప్రాయ పడ్డారు.అవార్డు స్వీకరించిన అనంతరం పస్తం సైదులు మాట్లాడుతూ.. తన పాత్రికేయ ప్రయాణంలో వెన్నంటి నిలిచిన కుటుంబ సభ్యులకు,తోటి జర్నలిస్టు మిత్రులకు, తన సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసిన ప్రసన్న అరుహి ఆర్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ, లియోనార్డ్ కల్చరల్ సొసైటీ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ పురస్కారం భవిష్యత్తులో మరింత బాధ్యతతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసేలా తనకు గొప్ప స్ఫూర్తినిచ్చిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పలువురు సీనియర్ పాత్రికేయులు, వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని పస్తం సైదులుకు అభినందనలు తెలిపారు.



డా. ఆలూరి విల్సన్‌కు బెస్ట్ ఈవెంట్ ఆర్గనైజర్ అవార్డు



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), నవంబర్16: సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో విశేష ప్రతిభ కనబరుస్తున్న డా. ఆలూరి విల్సన్ ప్రతిష్ఠాత్మక బెస్ట్ ఈవెంట్ ఆర్గనైజర్ అవార్డును అందుకున్నారు.లియోనా కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు డా. ఆలూరి విల్సన్‌కు ఈ పురస్కారాన్ని అందజేసి, ఘనంగా సన్మానించారు.ఈ వేడుకలో సినీ నటుడు, మా ఈసీ సభ్యులు డా. మాణిక్ రావు, ప్రముఖ రచయిత, వ్యాఖ్యాత, విశ్వభారతి కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ డా. రామకృష్ణ చంద్రమౌళి (శోభన్ బాబు), 'సముద్రుడు' ఫేమ్ సినీ నటుడు రమాకాంత్, విజయ చిత్ర నిర్మాత, దర్శకులు, ఎడిటర్ విజయ్ కుమార్, ప్రముఖ కవి, గీత రచయిత హరినాథ్ తదితరులు పాల్గొని, డా. విల్సన్‌కు అభినందనలు తెలిపారు.

డా. రామకృష్ణ చంద్రమౌళికి బెస్ట్ పోయెట్ అవార్డు-2026'



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్16: సాహిత్య రంగంలో విశేష సేవలందిస్తున్న ప్రముఖ రచయిత, వ్యాఖ్యాత, విశ్వభారతి కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ డా. రామకృష్ణ చంద్రమౌళి (శోభన్ బాబు) ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ పోయెట్ అవార్డు-2026'ను అందుకున్నారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎమ్ఈ స్టూడియోలో ప్రసన్న ఆరూహి ఆర్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ మరియు లియోనా కల్చరల్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు డా. రామకృష్ణ చంద్రమౌళికి అవార్డును అందజేసి, ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సినీ నటుడు, మా ఈసీ సభ్యులు డా. మాణిక్ రావు, సముద్రుడు ఫేమ్ సినీ నటుడు రమాకాంత్, 'విజయ చిత్ర' నిర్మాత, దర్శకులు, ఎడిటర్ విజయ్ కుమార్, హైదరాబాద్ సిటీ స్మాల్ కాజెస్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్, సంఘ సేవకురాలు డా. పీ.వీ.పీ. అంజనీకుమారి, ఆదరణ ఫౌండేషన్ అధ్యక్షురాలు నంబూరి విజయశ్రీ చౌదరి తదితరులు పాల్గొని, డా. రామకృష్ణ చంద్రమౌళికి అభినందనలు తెలిపారు.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.